# లంకె-బిందెలు

పి.జి.వుడ్‌హౌస్ ఫ్రోజెన్ ఎసెట్స్ కి

అనుసృజన – గబ్బిట కృష్ణమోహన్



## (గత సంచిక తరువాయి)

'**ఇంత సదుపాయంగా, సౌకర్యంగా ఉంటే మురికివాడ** అంటావేమిటి? బొంబాయిలో మేముండే చోటు చూడాలి నువ్వు, ముఖ్యంగా శనివారం రాత్రిళ్ళు అందరూ పార్టీలు చేసుకున్న తరువాత. నరేష్, నన్నిక్కడికొచ్చి ఉండమన్నందుకు థాంక్సోయ్. నీ మేలు మరిచిపోను గురూ.'

'సంతోషం.'

'హోటల్ గ్రీన్ స్టార్‌లో గది ఖాళీ చేసి రాత్రికల్లా సామానుతో సహా ఇక్కడ దిగుతా'

పొద్దున టిఫిన్ చేస్తున్నప్పుడు నరేష్ కుమార్ ఫోను చేసినప్పటినుంచీ అతని బుర్రలో తొలుస్తున్న ప్రశ్న ఉన్న పళాన గుర్తుకొచ్చి దత్తు అడిగాడు. 'అవునయ్యా, నాకో విషయం అర్థం కాలేదు, నువ్వే సందేహం తీర్చి పుణ్యం కట్టుకోవాలి. నేనుంటున్న హోటలుకి పొద్దున ఫోన్ చేశావు. కరెక్టేనా?నేనక్కడ ఉంటున్నట్టు నీకెలా తెలిసింది?'

'జయంతి చెప్పిందా సంగతి.'

విస్తుపోయి చూశాడు దత్తు. అర్థంకాలేదతనికి.

'నువ్వేదో భ్రమలో ఉన్నట్టున్నావ్, పరాచికాలాడకు. బొంబాయిలో ఉంటూ తనెక్కడ చెప్పుంటుంది?'

'నేనూ బొంబాయిలో నాలుగురోజులుండి నిన్ననే తిరిగొచ్చా.'

'ఏమిటో అయోమయంగా ఉందంతా. ఇప్పుడు ఇంకో పాయింటు చూద్దాముండు. జయంతిని నువ్వెలా కలిశావు? ఒకవేళ కలిసినా తను జయంతని నీకెలా తెలిసింది? జీవితంలో నువ్వామెనెప్పుడూ కలవనేలేదాయె.'

'ఓ యస్, కలిశా. రెండేళ్ళ కిందట మేమిద్దరం లాంచిలో గోదావరంతా అయిదు రోజులపాటు తిరిగొచ్చాం. ఈ ఊరొచ్చే ముందురోజు రాత్రి బొంబాయి పోలీస్ స్టేషన్లో మళ్ళీ కలిశాం.'

పోలీస్ స్టేషన్లకి రెగ్యులర్ కస్టమరు కనుక ఈ విషయం విన్న దత్తుకి కుతూహలం రేగింది.

'లాకప్‌లో పెట్టేశారా తనని? పోలీసులు మొత్తానికి సాధించారన్నమాట, అవునా?'

నరేష్ కుమార్ మనసు చివుక్కుమంది. ప్రేమికులందరిలా తను ప్రేమించిన యువతిని అపార్థం చేసుకున్న స్వంత అన్న మీద వెగటు పుట్టింది.

'అదేం కాదు. నా మనీపరుసు పోయిందని కంప్లైంటు ఇవ్వడానికి వెళ్ళాను, సరిగ్గా అప్పుడే తను కూడా నువ్వు తప్పిపోయావని రిపోర్టు చెయ్యడానికొచ్చింది. చెప్పలేనంత ఆందోళన పడింది నీ గురించి.'

జయంతి చెప్పినట్టు అలా మొహం వాచేలా చివాట్లు పెట్టినా పట్టించుకోలేదు సరికదా, దత్తు, కొంచెం కూడా పశ్చాత్తాపం చూపించలేదు.

'ఆందోళన పడిందా, నిజంగానా? అసలు తన గురించి నేనెంత ఆందోళన పడుతున్నానో నీకు తెలీదు గురూ. నీకు చెప్పిందో లేదో కానీ తను మాత్రం మూర్ఖత్వంతో మొండిగా కసాయివాడి కత్తికి మెడ చాపింది. ఇంతలో ఏమైంది నీకు?'

జయంతి గురించి అలాంటి మాటలు విని చలించి, 'ఏం లేదు' అన్నాడు నరేష్ కుమార్ నిర్లిప్తంగా.

'పోయి పోయి ఎందుకూ పనికిరాని ప్రబుద్ధుడిని పెళ్ళి చేసుకోడానికి తయారుగా ఉంది. ఒట్టి సనాతన కుటుంబం.. నువ్వు కూడా అలాంటి కుటుంబం నుంచి వచ్చినవాడివేనని మరిచిపోయా, సారీ.'

'ఫరవాలేదులే. ఎవరో ఒకరయి తీరాలిగా. సనాతన కుటుంబం అన్నావా?'

'కాన్సులేట్‌లో ఉద్యోగం అతనికి. పేరు భాస్కర్రాజు. నీకు పరిచయం లేదులే.'

'తప్పు తప్పు. పరిచయమే కాదు, అతని గెస్ట్ రూములో రాత్రంతా తల దాచుకుని మర్నాడు పొద్దున అతని బ్రెడ్డు, జాము తిన్నొచ్చా. నేనున్న అపార్ట్ మెంట్‌లోకి పోలేని పరిస్థితి వస్తే జయంతి ఆ రోజు రాత్రికి అతనింట్లోనే బస ఏర్పాటు చేసింది. కానీ అతనికది ఏమాత్రం నచ్చినట్టు కనబడలేదు నాకయితే.'

'ఆ మనిషికి నచ్చదు. చూస్తూనే రోత పుట్టించే మనిషిలా అనిపించాడా?'

'చూసిన మరుక్షణంలోనే అలా అనిపించింది నాకు.'

'జయంతి అతన్లో ఏం చూసిందో ఏమో?'

'నేను కూడా అదే ఆశ్చర్యపోయా.'

'అయినా జరిగింది అది. ఆడపిల్లలంతా వింతగా ఉంటారోయ్. కృష్ణవేణిని చూస్తుంటే కొన్ని కొన్ని సార్లు నాకూ అలానే ఆశ్చర్యమేస్తుండేది. అనంతరామయ్యగారి మేనగోడలు కృష్ణవేణిని కలిశావా ఎప్పుడన్నా?'

'ఆమె గురించోసారి జయంతి చెప్పింది. కానీ కలవలేదెప్పుడూ.'

'ఒకప్పుడు మేమిద్దరం ప్రేమించుకున్నాం, పెళ్ళి చేసుకోవాలనుకున్నాం.'

'చెప్పింది జయంతి.'

'ఓ, చెప్పేసిందా నీకు? సరే, ఆ అమ్మాయి ఛామనచాయ రంగులో ఉన్నా నేను ప్రేమించిన ఒకే ఒక వ్యక్తి కృష్ణవేణి మాత్రమేనని బహుశా నీతో చెప్పుండకపోవచ్చు.  ఆమెని గాఢంగా ప్రేమించా. అలాంటిది కొద్దిరోజులకే తెగతెంపులు చేసుకుని దూరమైపోతే నా మనసు బద్దలయిందయ్యా. జీవితం శూన్యంలా తోచింది.'

'నువ్వలా కనబడ్డం లేదు.'

'కనబడను. మొహానికి ముసుగు తొడుక్కున్నా. జరిగిందయితే అది అని చెబుతున్నా. నరేష్, నీకెదురుగా కూచున్నవాడు భగ్నహృదయుడు, జీవితంలో ఏ మాత్రం ఆశలు లేనివాడు.'

'దిగంబరయ్యగారి నుంచి సంక్రమించే సంపద ఒక్కటి తప్ప.'

'ఓ అదా,' అన్నాడు దత్తు. అసలా ఆలోచన మనసులో పెట్టుకోనట్టు చేతులు అడ్డంగా ఊపుతూ. కాసేపు మౌనంగా ఉండి మళ్ళీ ముఖంలో సంతోషం తెచ్చుకుని మొదలెట్టాడు.

'గురూ, నరేష్.'

'ఏవిటయ్యా?'

'నీకో సంగతి చెప్పనా? ఆ కృష్ణవేణి గురించే ఆలోచిస్తుంటే ఒక ఆసక్తికరమైన విషయం తట్టింది. పరిస్థితులు మారాయి కనుక మళ్ళీ తను ముందులా ఆహ్లాదంగా వెన్నెల కురిపిస్తూ వచ్చే రోజు రావచ్చనిపిస్తోంది. నా కొచ్చిన సంపద - అదనపు ఆకర్షణ అనుకో - ఆమె మనసులోకి చేరితే అభిప్రాయం మార్చుకోవచ్చు.'

'కోవచ్చు.'

'స్త్రీ జాతిని నువ్వెప్పుడన్నా నిశితంగా పరిశీలించావా?'

'అంతగా లేదు.'

'నేనది చాలా చేశా. అందుకే చెబుతున్నా విను - ప్రేమించినవాడిని మడమతో తన్ని వెళ్ళగొట్టిన స్త్రీ - ఆ ప్రేమికుడికి యాభై పెద్ద పెద్ద కంపెనీల్లో మెజారిటీ వాటాలొచ్చాయని తెలిసిన తరువాత తన అభిప్రాయం మార్చుకుంటుంది. అలాగే కృష్ణవేణి కూడా ఇప్పుడు నా స్కోరెంతో తెలుసుకోగానే క్షమిస్తూ జరిగినవన్నీ మరిచి పోతుంది. అవునా కాదా?'

'నువ్వుగాని మరీ ఆమెని వేధించి కోపం తెప్పించకుండా ఉంటే, అవుననే చెప్పొచ్చు. ఇంతకీ ఆమె అలా తిప్పికొట్టడానికి నువ్వేం నేరం చేశావు?'

'ఉంగరాల జుట్టు గురూ, ఉంగరాల జుట్టు. ఆ రోజుల్లో ఉంగరాల జుట్టున్న అమ్మాయిలంటే పడి చచ్చేవాడిని. దానికి అభ్యంతరం చెప్పింది తను. చెప్పాలంటే నా ప్రవర్తనకి మండిపడింది. నీకు తెలుసుగా కృష్ణవేణి ఎలాంటిదో.'

'తెలీదు. ఇంతవరకు కలవలేదు తనని.'

'అవును కదా, నువ్వు కలవలేదు. మరిచిపోయానది. సౌమ్యంగా, నిమ్మళంగా, నిశ్చలంగా ఉండేవాళ్ళ కోవకి చెందుతుంది తను. ఎలాంటి పరిస్థితుల్లోనూ సంయమనం కోల్పోని గొప్ప వ్యక్తి. కానీ అవకాశం దొరికితే చాలు డైనమైట్ పేద్ద చప్పుడు చేస్తూ పేలి చుట్టుపక్కలంతా సర్వనాశనం చేసినట్టు తను కూడా పేల్తుంది. నేనో ఉంగరాల జుట్టమ్మాయిని - ఆ పిల్ల పేరు రజనో ఏదో అంత బాగా గుర్తులేదు - ఓ రోజు రాత్రి డిన్నరుకి తీసుకెడితే చూసి సరిగ్గా డైనమైట్ పేలినట్టే చేసింది. ఏడాది కిందట జరిగింది. నరేష్, ఏడాదంటే చాలాకాలం కదూ?'

'అవును గురూ.'

'ఇప్పటికే మనసు మార్చుకునొండొచ్చు కూడా'

'ఆడపిల్లలు అంతేనంటారు.'

'ప్రత్యేకించి, జీవితంలో మళ్ళీ ఉంగరాల జుట్టు జోలికి పోనని ప్రయాణం చేస్తే తప్పక మార్చుకుంటుంది. ఇప్పుడేం చెయ్యాలో తెలుసా? తననోసారి బయటికి తీసుకెళ్ళి మూడెలా ఉందో కనిపెట్టాలి. చిక్కల్లా కృష్ణవేణి ఇంటి అడ్రసు కూడా తెలీదు. మునుపు గాజువాకలో ఉంటుండేది, ఇప్పుడు లేదు. డిటెక్టివ్‌లతోనో, వేటకుక్కలతోనో వెతికించడం తప్ప మరోదారి కనిపించడం లేదయ్యా.'

'ఓశ్, అదేమంత కష్టమైన పనికాదు. ఆ పిల్ల అనంతరామయ్యకి మేనకోడలన్నావుగా, అతన్నే అడుగు.'

చూపుడు వేలుతో గడ్డం మీద కాసేపు రాసుకుంటూ ఆలోచించాడు దత్తు.

'మనిద్దరి మధ్యనే కనక చెబుతున్నా నరేష్, ఇప్పుడప్పుడే అనంతరామయ్యని కలవాలని లేదు నాకు.'

'పోనీ ఆఫీసుకెళ్ళి ఆయన సెక్రెటరీని అడుగు. ఆమెకి తప్పకుండా తెలిసుంటుంది.'

'మై గాడ్, నరేష్, నీ బుర్ర అమోఘం. ఇప్పుడాపనే చేస్తా. వెంటనే వెళ్ళి ఆ పిల్లని కలిసొస్తా. ఈ లోపల నువ్వేం చెయ్యాలంటే జయంతికి ఫోన్ చేసి శుభవార్త చెప్పేసెయ్యి. పన్లో పనిగా ఆ పెయింటింగ్ సంగతి కూడా చెప్పు. దాని అవసరం నాకెంతుందో, అది

లేకపోతే పరిస్థితులు ఎలా విషమిస్తాయో చెప్పు. జయంతి నెంబరు రాసిస్తా తీసుకో. నే వెళ్ళొచ్చిన తరువాత మనం కలిసి డిన్నరుకెడితే ఎలా ఉంటుందంటావ్?'

'అయ్యో, నాకు వీలుకాదయ్యా. మా అంకులింటికి డిన్నరుకెళ్ళాలి.'

'మరింకేం నన్ను కూడా నీతో తీసుకెళ్ళు.'

'నీకాయన నచ్చడు గురూ. ఆయనో పెద్ద లాయరు - మేడిపల్లి అండ్ మేడిపల్లి, జగదంబా జంక్షన్‌లో ఉందాయన ఆఫీసు. పేరు మోసిన లాయరే కాదు, విలక్షణమైన వ్యక్తి. అయితే ముభావంగా ఉంటాడు. నోరు విప్పితే కటుగ్గా, వ్యంగ్యంగా మాట్లాడతాడు. నీ టైపు మనిషికాడు. సరే, నువ్వా సెక్రెటరీని కలవాలంటే తొందరగా వెడితే మంచిది. నువ్వెళ్ళేలోపు దుకాణం కట్టేసి ఇంటికి పోవచ్చు.'

'ఇదిగో వెంటనే బయలుదేరుతున్నా. ఇంతకీ ఈ బృహత్ ప్రచురణాలయం ఆఫీసెక్కడ?'

'రామకృష్ణా బీచ్‌కి వెళ్ళే దార్లో ఉంటుంది, పెద్ద బిల్డింగు.'

'ఇంత లేటయినా ఆ అనంతరామయ్యగాడు ఇంకా ఆఫీసులోనే ఉండుంటాడా?'

'ఎప్పుడో ఇంటికి పోయుంటాడు. అయినా ఉంటే మాత్రం ఏమవుతుంది? అసలు నువ్వాయన్ని కలవకూడదని ఎందుకనుకుంటున్నావ్?'

'ఆ విషయం గురించి చెప్తా విను. నరేష్, జీవితంలో కొన్ని చిత్ర విచిత్రాలు జరుగుతుండటం గమనించే ఉంటావు. నేననేది మనం ఎంత చేసినా తృప్తిపరచలేము అని. ఇప్పుడు జరిగిందే చూడు. దిగంబరయ్యగారు రాసినది - వీలునామా అంటావో, బహుకరణ అంటావో ఏదో ఒకటి - నాకు ఆనందం కలిగించిందా, అదే అనంతరామయ్యకి పెద్ద షాకిస్తుంది. ఈ మనిషి స్వర్గీయ దిగంబరయ్యగారికి స్వయానా తోడపుట్టిన తమ్ముడు కావడం మూలాన ఆస్తంతా తనకే ఇస్తాడనో, మొత్తమంతా కాకపోయినా చాలావరకన్నా ఇస్తాడనో ఆశించి ఉంటాడు. కనక అసలు సంగతి తెలిసి ఇప్పటికే పళ్ళు నూరుతూ ఉండొచ్చని నాకనిపిస్తోంది. ఈ పాటికి విషయం తెలిసుంటే నన్ను చూడగానే గుండాగి చూస్తాడు. నిజానికి అనంతరామయ్యకి ఇప్పటికే బోలెడంత ఐశ్వర్యం ఉంది, ఈ కాస్త డబ్బు ఏపాటికాయనకి. ఎప్పటికీ నిరాశ పడకూడదు గురూ,' అంటూ దత్తు తాత్విక ధోరణిలోకి దిగి వెళ్ళిపోయాడు.

●●●

వంటరిగా మిగిలిన నరేష్ కుమార్, దత్తు ఇచ్చిన నంబరు డయల్ చెయ్యడంలో ఏ మాత్రం ఆలస్యం చెయ్యలేదు. మరోసారి జయంతి గొంతు వినే అవకాశం గొప్ప భాగ్యంగా తోచింది.

కొంచెం సేపటి తరువాత, 'జే?' అంటూ అడిగాడు.

జవాబిచ్చిన గొంతు జయంతి కాదు, భాస్కరరాజుది.

'మీరెవరు?'

'హాల్లో భాస్కరరాజుగారూ. నేనండీ, నరేష్ కుమార్‌ని. జయంతితో మాట్లాడాలి, కొంచెం పిలుస్తారా?'

'ఇంట్లో లేదామె,' అన్నాడు భాస్కరరాజు, అనుమానస్తుడికి వీసా నిరాకరిస్తున్నట్టు నిరుత్సాహం చూపించే గొంతుతో.

అతను చెప్పింది నిజం కాదు. డిన్నరుకి వెళ్ళేందుకు పక్క రూములో ముస్తాబవుతోందామె. అబద్ధం చెప్పేందుకు వెనుకాడలేదతను. ఏదో కీడు శంకిస్తున్నాడు. ఆరోజు రాత్రి వాళ్ళిద్దరూ చెట్టపట్టాలేసుకుని ఇంట్లో వాలినప్పటినుంచీ నరేష్ కుమార్‌ని తన ప్రియురాలు జయంతి అతిగా ఆదరించిన వైఖరి భాస్కరరాజుకెందుకో అనుమానంగానే ఉంది. అది చాలదన్నట్టు ఇదిగో ఇప్పుడీ టెలిఫోన్ కాల్ - దుర్మార్గ, దుష్ట, రహస్య, మోసపూరితమైన టెలిఫోన్ కాల్ - రాగానే తన అనుమానం నిజమేనని తేలింది. రిసీవరు ఠక్కున పెట్టేస్తుంటే కళ్ళల్లో కాఠిన్యం చోటు చేసుకుంది.

ముస్తాబు పూర్తి చేసుకుని బెడ్ రూములోంచి జయంతి బయటికొచ్చి, 'ఎవర్నించి ఫోను?' అని అడిగింది.

'ఏదో రాంగ్ నెంబర్లే,' అన్నాడు భాస్కర్రాజు.

●●●

ఈ వృత్తాంతంలో అడపాదడపా దొర్లిన అనంతరామయ్య మరెవరో కాదు - నరేష్ కుమార్‌కీ, పిల్లి సుబ్బరాజు మేనకోడలు మిస్ మీనాక్షికీ బతుకుతెరువు కోసం ఉద్యోగాలిచ్చి పోషిస్తున్న యజమాని. నిజానికి అతన్ని డాక్టర్ అనంత్ అని వ్యవహరించాలి. ప్రింటింగ్ ప్రెస్ కనిపెట్టిన తరువాత వచ్చిన డైలీ, వీక్లీ, మంత్లీ పత్రికల్లో నికృష్టమైన వాటిని తెలుగు పాఠకులకి అందించి స్వైరవిహారం చేస్తున్నందుకు కొంతకాలం కిందట ఒక యూనివర్సిటీ అతనికి డాక్టరేట్ బిరుదునిచ్చి సత్కరించింది. బృహత్ ప్రచురణాలయం వ్యవస్థాపకుడు, అధిపతి అతనే. నరేష్ కుమార్ ఇంటికి దత్తు వచ్చి కలిసిన టైములో ఆఫీసులో సెక్రెటరీ మిస్. మీనాక్షికి ఉత్తరాలు డిక్టేట్ చేస్తున్నప్పుడు అతని క్రీగంటి చూపుల్లో మిస్. మీనాక్షి మీద ప్రేమ ఉట్టిపడుతోందనీ, భావకవుల భాషలో - అతని గొంతు ప్రేయసిని దువ్వే గువ్వ విధంగా ఉందని చెప్పవచ్చు.

డాక్టర్ అనంత్ పొట్టిగా, లావుగా ఉంటాడు. చేపల కూర, చేపల పులుసు తిన్నప్పుడు శరీరానికి పడక ఒళ్ళంతా దద్దుర్లు లేస్తాయి. అంత గొప్ప ప్రచురణాలయ సామ్రాట్టు దద్దుర్లతో ఎంత సతమతమవుతున్నా - సన్నగా, అందంగా, సుకుమారంగా ఉన్న అమ్మాయితో ప్రేమలో పడకూడదని ఏ చట్టమూ శాసించలేదు. మిస్ మీనాక్షి కన్నా మరింత అందంగా, సుకుమారంగా ఉండే ఆ వయసు ఆడపిల్లలు చాలా తక్కువమందుంటారు. పైగా అనంతరామయ్య వయసు చాలా ప్రమాదకరమైంది కూడా. ఈ వయసులోనే సినిమా స్టార్లు రెండో పెళ్ళి, మూడో పెళ్ళి చేసుకునేది.

భార్య చనిపోయి చాలాకాలమైంది. ఒట్టి అనంతరామయ్యగా ఉన్న రోజుల్లో, రకరకాల మేగజీన్లు ప్రచురించే ముందు, 'సమాజ సుగంధాలు' పత్రిక కూడా లేనప్పుడు, అతి సామాన్య కుటుంబానికి చెందిన నాగవల్లిని పెళ్ళి చేసుకున్నాడు. రెండేళ్ళు గడిచాయో లేదో ఆమె అతి సాధారణంగా అతని జీవితంలోంచి నిష్క్రమించింది. మళ్ళీ ఎవరితోనన్నా సంబంధం పెట్టుకోవాలనే ఆలోచన రాలేదతనికి. వ్యాపారంలో తలమునకలు అవడంతో స్త్రీ సాంగత్యం కోసం పరితపించలేదు. ఇంట్లో ఉన్న ఒక్క స్త్రీ - మేనకోడలు కృష్ణవేణి మాత్రమే. భీముని పట్నంలో రాజమహల్లాంటి అతని ఇంటి వ్యవహారాలన్నీ ఆమే చూసుకుంటుంది.

ఆ తరువాత మిస్ మీనాక్షి ఉద్యోగంలో చేరటం జరిగింది. కింది ఉద్యోగుల్లో చాలామంది ఈ ముసలాడికి సరైన శాస్తి కుర్చీ కిందెవరన్నా బాంబు పేల్చడమేనని చెప్పుకుంటుంటారు. సరిగ్గా వాళ్ళ కోరికని మాటల్లో కాక చేతల్లో జరిపించినట్టు ఈ అమ్మాయొచ్చి ఆఫీసులో జాయనయింది. ధవళేశ్వరం రేవులో ఉన్న తన ఎయిర్ కండిషన్డ్ లాంచి రిపేరు కాగానే మిస్ మీనాక్షిని వెంటేసుకుని హాయిగా గోదావరిలో కొన్ని రోజులు గడపటానికి ఉవ్విళ్ళూరుతున్నాడు. ఆ లోపల, ఆమెకి ఉత్తరాలు డిక్టేట్ చేస్తున్నాడిప్పుడు.

'సమాజ సుగంధాలు' మేగజేను మేటరులో ఉల్లాసం, ఉత్తేజం బొత్తిగా నశించాయని దాని ఎడిటరుకి తెలియబరుస్తున్న ఉత్తరం అది. ఒకప్పుడు ఈ మేగజీనుకి పిల్లి సుబ్బరాజు కొడుకు - పిల్లి పుల్లారావు ఎడిటర్‌గా ఉండే రోజుల్లో తన పర్యవేక్షణలో వారానికొక కొత్త స్కాండల్‌ని ఆవిష్కరిస్తూ ఉచ్చస్థితికి తీసుకెళ్ళాడు. అయితే అనంతరామయ్య దగ్గిర నెలసరి జీతం పుచ్చుకుని ప్రజల అంతర్గత రహస్యాల్ని వెలికి తీసి పాఠకులకి అందించడం వట్టి దండగని పుల్లారావు చురుగ్గా ఆలోచించి, ప్రజానీకం వ్యవహారాలు తనే స్వంతంగా అన్వేషిస్తే మంచిదనుకున్నాడు. దాంతో ఉద్యోగం వదిలేసి పెట్టుబడి కోసం నలుగురి దగ్గిరా అప్పులు చేసి స్వతంత్రంగా ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీ తెరిచాడు. దాంతో జరిగిన నష్టాన్ని మరిచిపోకుండా ఇప్పటికీ బాధపడుతూ ఉంటాడు అనంతరామయ్య. ఆ తరువాత వచ్చిన వాళ్ళు పిల్లి పుల్లారావు కాలిగోటికి కూడా సరిరాలేదు. అందులో ప్రస్తుతం ఎడిటరుగా ఉన్న నరేష్ కుమార్ మీద చాలా గుర్రుగా అసంతృప్తితో ఉన్నాడు.

డిక్టేషన్ పూర్తయింది. పరుషమైన పదాలు వాడి దూషిస్తున్న లెటర్ని షార్ట్ హ్యాండ్లో రాసుకుంటూ ఏమిటింత అసహ్యంగా ఉందని మనసులో అనుకుంది మిస్. మీనాక్షి. చిట్టచివరి కఠోరవాక్యం నోట్లోంచి బయట పడినాక అనంతరామయ్యకి స్థిమితం చిక్కి మెత్తబడ్డాడు.

'మిస్ మీనాక్షీ, నీకు శ్రమ ఇవ్వడం లేదుకదా?' మృదువైన గొంతుతో అడిగాడు.

'అబ్బే, బొత్తిగా లేదు, డాక్టర్ అనంత్.'

అయినా పట్టు విడవకుండా, 'పొద్దుట్నించీ చాలా కష్టపడుంటావు, వాతావరణం కూడా బాలేదు, ఇంటికెళ్ళి రెస్టు తీసుకో', అని సలహా ఇచ్చాడు అనంతరామయ్య.

తమరి ఆపేక్షకి థాంక్సని చెప్పి సాయంత్రం డిన్నరు ఎంగేజ్మెంటుకి తోడుగా వస్తానన్న వ్యక్తి వచ్చేంత వరకు ఇక్కడే కాచుకుంటానని చెప్పింది.

'మా కజినొచ్చి తీసుకెడతాడు,' అంటూ మిస్. మీనాక్షి చెప్పింది విని అప్పటిదాకా అసూయతో ఒళ్ళుమండిపోతున్న అనంతరామయ్యకి ఊరట చిక్కింది. ఒట్టి కజిన్లయితే అభ్యంతరం లేదు.

ప్రాణం కుదుటపడినట్టు, 'ఐ.సీ' అని, 'మరైతే ఆ లోపల కొంచె ఢిల్లీ నెంబరు కలిపిస్తావా?' అన్నాడు.

'తప్పకుండా, డాక్టర్ అనంత్.'

'మల్హోత్రా, అగర్వాల్ అండ్ కంపెనీలో లాయరు మల్హోత్రాని కలపాలి. నెంబరు ఇక్కడుంది తీసుకో. వాళ్ళది పెద్ద లా కంపెనీ. విజయ్ మల్హోత్రాతో కాన్ఫిడెన్షియల్ అండ్ పర్సనల్ కాల్ అని చెప్పు.

'యస్, డాక్టర్ అనంత్.'

'నెంబరు రాసుకో. అన్నట్టు, మిస్. మీనాక్షీ, ధవళేశ్వరంలో లాంచి రిపేరు చేస్తున్నవాడితో మాట్లాడావా?'

'యస్, డాక్టర్ అనంత్.'

తలుపు మూసుకోగానే అనంతరామయ్య రకరకాల ఆలోచనల్లో మునిగాడు – ముఖ్యంగా మిస్. మీనాక్షి గురించీ, అరగంటకి పైన ఆమె అందచందాల్ని, భంగిమల్ని జుర్రుకుంటూ గడిపిన మధురస్మృతుల గురించీను. ఎదుటనుంచి చూస్తే ఆమె బాగా కనిపిస్తుందా, పక్క భంగిమలో బావుంటుందా అన్న ప్రశ్నకి సమాధానం వెదుకుతుంటే ఒకమ్మాయి తలుపు తోసుకుంటూ లోపలికొచ్చింది. తలుపన్నా తట్టకుండా, అందులోనూ అపాయింట్మెంట్ తీసుకోకుండా ఇలా రావడానికి ఎంత ధైర్యం అని అడగబోతుంటే వచ్చినమ్మాయి మేనగోడలు కృష్ణవేణేనని గుర్తించాడు.

మిస్. మీనాక్షితో పోల్చి చూస్తే కృష్ణవేణి అందమైందని ఎంతమాత్రం చెప్పలేం. అయినా చక్కటి కళ్ళు, నవ్వుతూ ఉన్నట్టుండే నోరు మూలాన ఆకర్షణీయంగా ఉందని చెప్పవచ్చు. కృష్ణవేణి చాలా తెలివైన పిల్ల అని నరేష్ కుమార్తో జయంతి చెప్పడం సబబే. ముఖంలో ప్రస్ఫుటంగా కనిపించేది ఈ లక్షణమే. తోటివాళ్ళందర్ని ఉద్యోగం చేసే చోట అందరూ అంటారు – ముఖ్యంగా ఆమె యజమాని. ఈ టైములో ఆమె రాక చూసి అనంతరామయ్యకి కోపమొచ్చినా అణిచిపెట్టుకుని విరాగ్గా చూశాడామె వంక.

'కృష్ణవేణీ, నువ్వా? ఎందుకొచ్చావ్?'

'డిస్టర్బ్ చేశానా మిమ్మల్ని?'

'అవును' అన్నాడు అనంతరామయ్య. మేనమామకీ మేనగోడలుకీ మధ్య ఆఫీసులో ఏ మాత్రం చనువు ఉండకూడదనుకుంటాడు. 'ఢిల్లీకి కాల్ చేసి మాట్లాడాలిప్పుడు.'

'సారీ, మామయ్యా. మనిద్దరికీ హోటల్ గ్రీన్ స్టార్‌లో చెరొక రూము బుక్ చేసినట్టు చెప్పడానికొచ్చా, అంతే. గోదావరిలో లాంచి షికారుకి బయల్దేరేందుకు వ్యవధి ఎక్కువ లేదు, ఈ లోపల మళ్ళీ కొత్త పనివాళ్ళని పెట్టడం దండగ. మీరు తిరిగొచ్చిన తరవాతే చూసుకుందాం, ఈ నాలుగు రోజులు హోటల్లో గడపచ్చులే అని బుక్ చేశా.'

వాళ్ళుంటున్న భీముని పట్నం ఇంట్లో ఈ మధ్య ఒకరోజున అనంతరామయ్యగారి కోపం అగ్నిపర్వతంలా బద్దలై లావా ప్రవహించి పనివాళ్ళంతా ఉన్న పళాన మూకుమ్మడి రాజీనామా చేశారు. తెలివైన పిల్ల కనక కృష్ణవేణి గత్యంతరం లేక హోటల్లో కొన్ని రోజులు తాత్కాలికంగా గడపటం మంచిదనుకుంది.

'మీ రూము మూడో అంతస్తులో ఉంది, నాది నాలుగో అంతస్తులో. చాలా సదుపాయంగా ఉంటుంది.'

'ఎన్ని రోజులుండాలి? నెలా, రెణ్ణెల్లా?'

'అబ్బే అన్నిరోజులక్కర్లేదు. పొద్దున మీరు ఆఫీసుకెళ్ళగానే మెకానిక్ ఫోన్ చేశాడు. రిపేరు పూర్తయి లాంచి ఇప్పుడు భేషుగ్గా ఉందిట. మీ ఇష్టమొచ్చిన రోజు బయల్దేరి రావచ్చన్నాడు.'

'గుడ్ నాకైతే రేపే బయల్దేరాలనుంది. దురదృష్టం కొద్దీ బొంబాయి నుంచి రమేష్ కపూర్ వస్తున్నాడు. అతన్ని రిసీవ్ చేసుకోవాలి, మర్యాదగా లంచికి తీసుకెళ్ళాలి. న్యూసెన్సే అయినా తప్పని సరి.'

'రమేష్ కపూరెవరు?'

'పెద్ద సినిమా ప్రొడ్యూసరు, స్వంత స్టూడియో కూడా ఉంది. మన పేపర్లకి బోలెడు అడ్వర్టయిజ్‌మెంట్లు ఇస్తాడు. మంచి చేసుకోవాలతన్ని, కోపం తెప్పించకూడదు. కృష్ణవేణీ, ఇఫ్ యూ డోన్ట్‌మైండ్, నేనిప్పుడు చాలా ముఖ్యమైన టెలిఫోన్ కాల్ చెయ్యాలి.'

'రమేష్ కపూర్‌కేనా?'

'కాదు, అతనెక్కడో ఉన్నాడు. ఇది మా అన్న దిగంబరయ్యగారి లాయర్లకి.'

'ఓహో, వీలునామా గురించా?'

'కరెక్ట్'.

'వాళ్ళేం చెబుతారో నేను కూడా వినాలి. మీకేమన్నా ఇచ్చాడో లేదో అనుమానమే నాకు.'

'నాకు తప్ప ఇంకెవరికో రాస్తాడని ఊహించలేను కూడా. మా ఇద్దరికీ సంబంధాలు అంతంత మాత్రమే అయినా స్వయానా తోడపుట్టిన వాడిని కదా ఎంతైనా, అందుకే.'

'అనాథాశ్రమాలు, గుళ్ళూ గోపురాల సంగతేమిటి?'

'దానధర్మాలంటే ఏ మాత్రం ఇష్టం ఉండేదికాదాయనకి.'

'అయితే ఆ సంపదంతా మీరే పోగుచేసుకుంటారన్నమాట. అయినా ఆయన ఆస్తికి మీరెందుకు వెంపర్లాడుతున్నారో అర్థం కావడం లేదు. ఇప్పుడున్నది తక్కువా?'

అలా అడ్డదిడ్డంగా వాదించేవాళ్ళంటే అనంతరామయ్యకి ఒళ్ళు కంపరం పుడుతుంది. అందుకని, 'డోంట్ బీ సిల్లీ,' అంటుండగానే టెలిఫోను మోగుతుంటే 'ఆహా!' అని, కాటెయ్యబోయే పాములా రక్కున రిసీవరెత్తాడు.

●●●

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments